క్లుప్తంగా

గాదిలింగప్ప ఆశయాలు కొనసాగిస్తాం



గాదిలింగప్ప చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భవాని

గుంతకల్లుటౌన్: గుత్తి నియోజకవర్గం అభివృద్ధికి విశేషంగా కృషి చేసిన బీసీ నేత, దివంగత మాజీ ఎమ్మెల్యే ఎన్.గాదిలింగప్ప ఆశయాల సాధనకు పాటుపడతామని మున్సిపల్ చైర్‌పర్సన్ ఎస్.భవాని, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గాదిలింగేశ్వరబాబు అన్నారు. ఆదివారం పాత బస్టాండ్‌లోని చిన్నబాబు కార్యాలయంలో జరిగిన గాదిలింగప్ప 21వ వర్ధంతి కార్యక్రమానికి వారు హాజరై ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, నియోజకవర్గం వృద్ధికి గాదిలింగప్ప చేసిన కృషిని కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ, ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న బి.శ్రీనివాసులు

గుంతకల్లుటౌన్: అనంతపురంలో ఈ నెల 23, 24న నిర్వహించే సీపీఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతి పిలుపునిచ్చారు. ఆదివారం ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా రానున్న రోజుల్లో చేపట్టబోయే ఉద్యమ కార్యాచరణను ఈ మహాసభల్లో రూపొందిస్తామన్నారు. జిల్లా మహాసభలకు కార్మిక, కర్షక, ప్రజలు తరలిరావాలని వారు కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు జగ్గిలి రమేష్, సాకే నాగరాజు, రమేష్, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

చర్చీలలో ఆరాధనోత్సవం



సీఎస్‌ఐ చర్చిలో ప్రసంగిస్తున్న బ్రదర్ ఎలీషా

పామిడి: మండలంలోని అన్ని చర్చీలలో ఆదివారం ఆరాధనోత్సవం ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా స్థానిక సీఎస్‌ఐ చర్చిలో నిర్వహించిన ఆరాధన కార్యక్రమంలో గుంటూరువాసి, యూత్ మినిస్ట్రీ దైవసేవకుడు ఎలీషా ప్రసంగించారు. సర్వ మానవ పాప పరిహారార్థం క్రీస్తుఏసు ఈలోకాన ఉద్భవించారన్నారు. దేవుడికి మహిమకరంగా జీవించినప్పుడే మన జీవితాలు ధన్యకరమన్నారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు వీరయ్య, జయరాజు, అబ్రహాం, పీసీ రత్నరాజు, బుజ్జిబాబు, కరుణాకర్, రాజు, ప్రసాద్, రజని, మంజుల, జయామణి, చంద్రకళ, డాక్టర్ కమల, మెర్సీ, రేచెల్, వాణి, మహిమ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

గార్లదిన్నె: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు యర్రగుంట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత ఆరోగ్య వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ దిలీప్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రీయ బాలల స్వస్థ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఎత్తు, బరువు, ఛాతీ కొలతలు, రక్తశాతం పుట్టుకతో వచ్చే రోగాలు, అంకవైకల్యం, బుద్ధిమాంద్యం, కంటి జబ్బులపై ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. జబ్బులు ఉన్న విద్యార్థులను చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేస్తామన్నారు. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు రోజూ పోషకాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యవిస్తరణ అధికారి నాగేశ్వరయ్య తదితరులు పాల్గొ న్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు



గుంతకల్లు: స్థానిక హనుమేష్‌నగర్‌లోని పరిటాల కల్యాణ మండపం వద్ద రహదారిలోని కల్వర్టు ప్రమాదకరంగా మారింది. డ్రైనేజ్ కాలవపై నిర్మించిన కల్వర్టు రెండు చోట్ల ఛిద్రమై పెద్ద రంధ్రాలు పడ్డాయి. దీంతో కనీసం ద్విచక్రవాహనాలు, ఆటోలు ఈ మార్గంలో వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నారు. ఈ మార్గంలో మండపంతో పాటు కళాశాల, ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలతో పాటు ఆస్పత్రులకు ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. దీంతో రాత్రి సమయాల్లో కల్వర్టుపై పడ్డ పెద్ద రంధ్రాలను గుర్తించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కల్వర్టును మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గుండె గుబిల్లు!

- పెరిగిన కరెంట్ బిల్లులతో సామాన్యుల హడల్
- కూటమి ప్రభుత్వంపై పేదల ధ్వజం



కరెంటు బిల్లు రూ.31 వేలు చెల్లించాలని లబ్ధిదారుడికి ఇచ్చిన రసీదు



వినియోగదారుల పెండింగ్ బిల్లుల లిస్టు

యల్లనూరు: ఈ నెల కరెంట్ బిల్లులు చూసి సామాన్యులు అవాక్కవుతున్నారు. బిల్లులు చూడగానే లబ్ధిదారులు వామ్మో మేం ఇంత కరెంట్ వాడుకోలేదని విద్యుత్ అధికారులతో వాదిస్తున్నారు. ఎప్పుడూరాని విధంగా కరెంటు బిల్లులు కూటమి ప్రభుత్వంలో అధికంగా చార్జీలను వేసి వసూలు చేస్తున్నారు. యల్లనూరు మండలంలో పెద్దమల్లేపల్లి, కోడుమూర్తి, యల్లనూరు, వాసాపురం, కల్లూరు గ్రామాల్లో ఇదే పరిస్థితి. రెక్కాడితే డొక్కాడని కూలీలు, పూట గడవక ఉదయం నుంచి సాయంత్రం వరకు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతులు, కూలీలకు ఊహించని విధంగా కరెంటు బిల్లుల మోత అంతా ఇంతా కాదు. కరెంటు బిల్లులు చూస్తుంటే గుండెలు ఆగిపోతున్నాయని ప్రజలు వాపోతున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఒక్క రూపాయి కూడా బిల్లు వసూలు చేయలేదని, కూటమి ప్రభుత్వం కొలువయ్యాక భారీగా భారం మోపుతున్నారని ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు మండిపడ్డారు.

పెద్ద మొత్తంలో బిల్లు కట్టలేం..

పెద్ద మొత్తాల్లో కరెంటు బిల్లులు కట్టాలంటే మా చేత కాదని దళితులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి మినిమం బిల్లులు వసూలు చేసుకోవాలని పలువురు కోరుతున్నారు. కాగా ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు 200 యూనిట్లు దాటితే ఎంత వరకు కరెంటు కాల్చి ఉంటారో అంత డబ్బులు ప్రభుత్వానికి చెల్లించాలి. సర్వీసు డేట్ ఆఫ్ రిలీజ్ నుంచి బిల్లు పెండింగ్ ఉంటుంది. 2016 సంవత్సరం కంటే ముందు 100 యూనిట్లు ఉండేది. 2016 నుంచి 200 యూనిట్లు ఉచితంగా సరఫరా అవుతుంది. చాలా చోట్ల కరెంటు స్టవ్, వాటర్ హీటర్లు వాడుతున్నందున కరెంటు బిల్లులు ఎక్కువ వచ్చి ఉంటాయని విద్యుత్ అధికారులు చెబుతున్నారు.

రూ.31 వేల బిల్లు వచ్చింది



నేను కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. నా పేరుతో కరెంట్ మీటర్ ఉంది. 2016 నుంచి కరెంటు బిల్లు కట్టలేదంటూ రూ.31 వేలు చెల్లించాలని బిల్లు ఇచ్చారు. దళితులు 200 యూనిట్ల వరకూ ఉచితంగా కరెంటు వాడుకోవచ్చు. అధికారులు న్యాయం చేయాలి.

– పెద్దిరాజు, పెద్దమల్లేపల్లి

ఇంత బిల్లు ఎలా కట్టాలి?

మాకు కరెంటు బిల్లు రూ.30 వేలు వచ్చింది. రూ.వేలల్లో కరెంటు బిల్లులు ఇస్తే పేదలు ఎలా కట్టాలి. కూలీ పనులు చేసుకుంటున్న వాళ్లకి అంత బిల్లులు వస్తే ఎలా చెల్లిస్తారు. అధికారులు స్పందించి మాకు న్యాయం చేయాలని కోరుతున్నాను.

– ఆర్‌కే నరసింహులు, శింగవరం

కరెంటు ఆదా చేసుకోవాలి



200 యూనిట్లు దాటిన ఎస్సీ, ఎస్టీ వారినే బిల్లులు చెల్లించమంటున్నాం. అంత బిల్లులు వచ్చింటే ఇన్‌స్టాల్ మెంట్ ప్రకారం చెల్లింపులు చేయించాలని ఏఈలకు చెప్పాం. ఎక్కువ మొత్తంలో ఉంటే నాలుగు, ఐదు కంతుల వారీగా చెల్లించవచ్చు. కరెంటు ఆదా చేసుకుంటే వారికే మంచిది.

– రాజశేఖర్, విద్యుత్ శాఖ డీఈ, గుత్తి

కార్మిక సమస్యలపై ఉద్యమాలు



విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

గుంతకల్లు: కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై దశలవారీగా ఉద్యమాలకు శ్రీకారం చుట్టినట్లు ఏఐటీయూసీ గౌరవాధ్యక్షుడు ఎం.వీరభద్రస్వామి, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మిక సంఘం జిల్లా నాయకుడు నరసయ్య అన్నారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 60 ఏళ్లు నిండిన ఆప్కాస్ కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. అదేవిధంగా పీఎఫ్, ఈఎస్ఐ సమస్యలను వెంటనే పరిష్కారించాలన్నారు. పర్మినెంట్ కార్మికులకు సరెండర్ లీవుల డబ్బులు చెల్లించాలన్నారు. పలు సమస్యలపై ఏఐటీయూసీ, సీఐటీయూ, మున్సిపల్ పారిశుద్ధ్య కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాని పట్టించుకోలేదన్నారు. దీంతో సోమవారం, మంగళవారం నల్లబ్యాడ్జీలతో నిరసన, బుధవారం, గురువారం కార్మిక రోదన, శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ధర్నా చేపడతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ పారిశుద్ధ్య సంఘం నాయకులు చిన్న, పెంచలయ్య, సీఐటీయూ నాయకులు వెంకటేశులు, కసాపురం రమేష్, సూరి తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల సంక్షేమానికి కృషి



వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు నారాయణరెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఆ పార్టీ నాయకులు

గార్లదిన్నె: అన్నదాతల సంక్షేమానికి కృషి చేస్తానని రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు వై.నారాయణరెడ్డి అన్నారు. ఇటీవల ఆయన జిల్లా అధ్యక్షుడిగా నియామకం అవడంతో.. ఆదివారం నారాయణరెడ్డి ఇంటికి మండల వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి పూలమాలతో ఘనంగా సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షులను నియమించారన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి సేవలందిస్తుండడంతో తనకు రైతు విభాగం జిల్లా అధ్యక్ష పదవి దక్కిందన్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఎంపిక చేసిన వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి, తన ఎంపికకు సహకరించిన పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటరామిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థికసాయం



నగదు అందజేస్తున్న దృశ్యం

తాడిపత్రి: మృతిచెందిన స్నేహితుడి కుటుంబానికి డిగ్రీ కళాశాల మిత్రబృందం రూ.82 వేలు ఆర్థిక సాయం అందించారు. వివరాలు అనంతపురంలోని మూడో రోడ్డులో నివాసం ఉంటున్న రాఘవేంద్రకు భార్య, వాసంతి, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. నారాయణ కాలేజీలో అటెండర్‌గా విధులు నిర్వహిస్తూ జీవనం సాగించేవాడు. ఇటీవల రాఘవేంద్ర స్కూటర్‌పై కళాశాలకు వస్తుండగా వెనుక వైపు నుంచి ద్విచక్ర వాహనం ఢీ కొన్న ఘటనలో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న తాడిపత్రి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2008 బ్యాచ్ విద్యార్థులు తమ గురువుకే గురుమోహన్ చేతుల మీదుగా రాఘవేంద్ర భార్య వాసంతికి ఆదివారం రూ.82 వేల నగదును అందించారు. కార్యక్రమంలో రాఘవేంద్ర స్నేహితులు వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాసులు, సురేష్, శంకర్, గురు ప్రసాద్, శ్రీనాథ్‌గౌడ్, కోమలి శ్రీను, బాలగంగాధర్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లోక రక్షకుడు ఏసు క్రీస్తు



సెమీ క్రిస్మస్ వేడుకల్లో ప్రసంగిస్తున్న పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్



పిల్లల సాంస్కృతిక కార్యక్రమ దృశ్యం

పామిడి: లోక రక్షకుడు క్రీస్తు అని పాస్టర్ రెవరెండ్ బీ విశ్వమోహన్ అన్నారు. ఆదివారం సాయంత్రం స్థానిక సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన సెమీ క్రిస్మస్, క్యాండిల్‌లైట్ సర్వీసును పురస్కరించుకుని ఆయన ప్రసంగించారు. సర్వమానవ పాపపరిహారార్థం తన రక్తాన్ని చిందించడానికి క్రీస్తు ఈలోకాన ఉద్భవించిన రోజును క్రైస్తవులు క్రిస్మస్‌గా ఆచరిస్తారన్నారు. క్రీస్తును మన హృదయంలోనికి ఆహ్వానించినప్పుడే నిజమైన క్రిస్మస్ అన్నారు. ఈసందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన దైవ సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం కేక్ కట్ చేసి, స్వీట్లు పంచారు. ఈసందర్భంగా క్రైస్తవులు క్యాండిల్స్ వెలిగించి క్యాండిల్ లైట్ సర్వీసు నిర్వహించారు. కార్యక్రమంలో పాస్టరమ్మ సువర్ణమ్మ, చర్చి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

దాడిపై కేసు నమోదు

పామిడి: పట్టణంలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై ఐచర్ వాహన డ్రైవర్‌పై కొందరు గుర్తు తెలియని వ్యక్తులు కత్తితో దాడి చేయడంపై కేసు నమోదు చేసినట్లు సీఐ వీ యుగంధర్ ఆదివారం రాత్రి తెలిపారు. ఈ నెల 19న రాత్రి 11 గంటల సమయంలో స్థానిక గజలక్ష్మి మిల్లు వద్ద పార్కింగ్ చేసిన ఐచర్ వాహన డ్రైవర్‌పై కొందరు దాడి చేశారు. ఈసందర్భంగా అతని వద్ద ఉన్న రూ1200తో పాటు సెల్‌ఫోన్ చోరీ చేశారు. బాధిత ఐచర్ వాహన డ్రైవర్ ఫిర్యాదు మేరకు గుర్తు తెలియని వ్యక్తులపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

గుత్తి రూరల్: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఓబిలేసు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఫిర్యాదుల కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు హాజరు కావాలని తహసీల్దార్ సూచించారు.

రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలు

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మందికి గాయాలయ్యాయి. వివరాలు .. తాడిపత్రి నుంచి బ్రహ్మసముద్రం మండలానికి ఆదివారం ఎనిమిది మంది ప్రయాణికులతో ఆటో బయల్దేరింది. కళ్యాణదుర్గం మున్సిపాలిటీ పరిధిలోని ఒంటిమిద్ది గ్రామం వద్దకు ఆటో రాగానే, వెనుక వైపు నుంచి బొలెరో వాహనం ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. దీంతో ఆటో బోల్తాపడింది. ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న దస్తగిరమ్మ, నూర్జహాన్, హెక్షావలి, కుళ్లాయప్ప, వన్నూర్‌బీ, ఖాసీం, అబ్దుల్ స్వల్పంగా గాయపడ్డారు. రోడ్డు పక్కనున్న ఒంటిమిద్దికి చెందిన చంద్రకు కాలు విరిగింది. ఓబులేసు స్వల్పంగా గాయపడ్డాడు. గాయపడిన వారిని స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పట్టణ పోలీసుల కేసు దర్యాప్తు చేపట్టారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉచిత సోలార్ ప్యానల్ పథకం

గార్లదిన్నె: ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులకు పీఎం సోలార్ సూర్య ఘర్ ఉచిత సోలార్ ప్యానల్ పథకం కేంద్ర ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్నట్లు ట్రాన్స్ కో ఏఈ విజయ్ కుమార్ తెలిపారు. ఆదివారం ఏఈ మాట్లాడుతూ సోలార్ ప్యానల్ పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులు 2కే డబ్ల్యూపీ సామర్థ్యం కలిగిన సోలార్ ప్యానల్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా అందజేస్తాయన్నారు. అలాగే ఇప్పుడు వాడుకుంటున్న 200 యూనిట్ల పథకానికి అదనంగా పొందవచ్చన్నారు. ఇంటికి వాడుకోని మిగిలిన యూనిట్లకు డిపార్ట్‌మెంట్ వారు ఆ రోజు ఉన్న యూనిట్ రేట్లను బట్టి వినియోగదారుడి బ్యాంకు ఖాతాలో డబ్బు జమ చేస్తారన్నారు. వినియోగదారుడికి అదనపు ఆదాయం లభిస్తుందన్నారు. వినియోగదారుడి విద్యుత్ సర్వీస్‌కు సంబంధించి వివరాలను pm suryaghar.gov.in వెబ్ సైట్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ప్రభుత్వమే పూర్తి సబ్సిడీతో సోలార్ ప్యానల్ బిగిస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ప్రీమియం చెల్లింపు గడువు పొడిగింపు

శింగనమల: పప్పుశనగ, మొక్కజొన్న, జొన్న, వేరుశనగ పంటలు సాగు చేసిన రైతులు పంటల బీమా ప్రీమియం చెల్లింపు ఈ నెలాఖరు వరకూ పొడిగించినట్లు ఏఓ అన్వేష్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఎకరా పప్పుశనగకు రూ.450, జొన్నకు రూ. 316, మొక్కజొన్నకు రూ. 525, వేరుశనగకు రూ.480 , వరికి రూ.630 చెల్లించాలన్నారు. పంటల సాగు ధ్రువ పత్రాన్ని ఆర్‌బీకేలో పొందాలన్నారు.

‘కోటంక’లో ప్రత్యేక పూజలు



అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

గార్లదిన్నె: మండలంలోని కోటంక కొండల్లో వెలసిన గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం ప్రధాన అర్చకుడు రామాచార్యులు క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకుపూజ, అర్చనలు నిర్వహించారు. భక్తులకు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గుత్తి కోట అద్భుతంగా ఉంది



కోటను సందర్శించిన జడ్జి కాశీ విశ్వనాథ్ చారి

గుత్తి: గుత్తి కోట చాలా అద్భుతంగా ఉందని గుత్తి సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ్ చారి కితాబిచ్చారు. చారిత్రాత్మకమైన గుత్తి కోటను ఆదివారం ఆయన సందర్శించారు. కోటలోని ఏనుగు శాలలు, గుర్రపు శాలలు, బావులు, చీకటి గదులు, రంగ మంటపం, సొరంగాలు వంటివి పరిశీలించారు. గుత్తి కోట చరిత్ర, ప్రాముఖ్యతను కోట సంరక్షణ సమితి అధ్యక్షుడు విజయ భాస్కర్, గైడ్ రమేష్ వివరించారు.

ఘనంగా రామానుజన్ జయంతి



రామానుజన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పెన్షనర్లు

గుత్తి: పట్టణంలోని ప్రభుత్వ పెన్షనర్ల భవనంలో ఆదివారం శ్రీనివాస రామానుజన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామానుజన్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ శ్రీనివాస రామానుజన్ గణిత పితామహుడన్నారు. విద్యార్థులు రామానుజన్‌ను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్ష, సహాయ కార్యదర్శులు అబూ బకర్, కుళ్లాయి బాబు, పెన్షనర్లు పాల్గొన్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

గుత్తి రూరల్: మండలంలోని మాముడూరుకు చెందిన అనిల్‌కుమార్ అనే యువకుడు ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. ఆ యువకుడు కొన్ని రోజులుగా తీవ్ర అనారోగ్య, కుటుంబ సమస్యలతో బాధపడుతుండేవాడు. మనస్తాపం చెందిన అతడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో విషపు గుళికలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఇంట్లో అపస్మారక స్థితిలో పడి ఉన్న అతడిని కుటుంబసభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాల్లో ధనుర్మాస పూజలు



కన్యకాపరమేశ్వరి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

పామిడి: పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో ధనుర్మాస పూజలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా శ్రీకృష్ణ విశ్వరూప సందర్శన చిత్రపటాన్ని, గోదాదేవి, శ్రీకృష్ణ, వాసవీమాతా విగ్రహాలను శోభాయానంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ అష్టోత్తర పూజలు చేశారు. వేకువజామునే భక్తులు ఆలయానికి చేరుకొని తిరుప్పావై పాశురాన్ని, భగవద్గీత, స్తోత్ర పారాయణం గావించారు. వాసవీ మాతాకు అభిషేక పూజలు చేశారు.

గుత్తి కొండకు మంచు దుప్పటి



చలి తీవ్రత భారీగా పెరిగింది. మంచు వర్షంలా కురుస్తోంది. ఉదయం 9 గంటలైనా సూర్య కిరణాలు కనిపించకుండా మంచు దుప్పటి కప్పేస్తోంది. 30 అడుగుల దూరంలో రహదారి కనిపించనంత మంచు కురుస్తుండడంతో లైట్ల వెలుతురులో వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. ఆదివారం ఉదయం 8.30 గంటల సమయంలో గుత్తి కొండపై మంచు దుప్పటి కప్పుకుంది. కొండ కనిపించనంతగా పొగ మంచు వ్యాపించింది. హిమోదయం చూపరులను కట్టిపడేసింది. – గుత్తి: